సామాజిక చైతన్యానికి స్ఫూర్తి పూలే..

- జోన్ వ్యాప్తంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి
- పూలేకు నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు



నివాళులర్పిస్తున్న తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

అంబర్‌పేట: సామాజిక చైతన్యానికి స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ తెలిపారు. గురువారం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలోని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. ఆయన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్‌రెడ్డి, నాయకులు మెట్టు సాయి, లక్ష్మణ్‌యాదవ్, బొల్లు కిషన్, లక్ష్మీపతి యాదగిరి గౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్, నారాయణ స్వామి, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేశ్, రాంమోహన్, గడ్డం శ్రీధర్‌గౌడ్, తొలుపునూరి కృష్ణగౌడ్, కోటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పూలే వర్ధంతి కార్యక్రమానికి సీపీఎం నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, రాములు, ఆంజనేయులు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో...

చిక్కడపల్లి: సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌లతో ఆమె పాల్గొని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, ఆనంద్, శ్రీకాంత్, పి.నరిసంగ్‌రావు, సురేష్, లక్ష్మణ్‌యాదవ్, సత్యందోనేటి, నరిసింహ, బద్రి నారాయణ, రమేష్‌గౌడ్, డి.శ్రీనివాస్ ముదిరాజ్, రాజశేఖర్, రవి, కనకేష్, రాజు, నీరజ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్ణవివక్ష వ్యతిరేక పోరాటానికి ఆద్యుడు పూలే..

కవాడిగూడ: వర్ణవివక్ష వ్యతిరేక పోరాటానికి ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక విప్లవ మార్గదర్శకుడని అన్నారు. దళిత బహుజనోద్ధరణ కోసం తన జీవితాంతం శ్రమించిన సామాజిక తత్వవేత్త అని కొనియాడారు.



అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహరల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ నేతలు



అరుంధతినగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని,పూస రాజు



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు.

- అహోబిలం ఫీడర్ పరిధిలోని ఏటీఐ లైఫ్ హాస్పిటల్, ఆంధ్రాబ్యాంక్, సాయిబాబా పెంపుల్, హోటల్‌మేనేజ్‌మెంట్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...
- సాయిబాబా పెంపుల్ ఫీడర్ పరిధిలోని శివం, సాయిబాబా కమాన్, వీహెచ్ హౌస్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు...
- ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని కిషన్‌రావు హస్పటల్, ఇందిరానగర్, తిలక్‌నగర్ బ్రిడ్జ్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కులగణన తర్వాత బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమగ్ర కులగణన అనంతరం ఏ, బీ, సీ, డీ వర్గీకరణతో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణన అనంతరం బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. పార్లమెంటు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెబుతున్న విధంగా రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ ఫలాలను బీసీ కులాల ప్రజల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు ఏ, బీ, సీ, డీ అమలు ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని అన్నారు.

డిసెంబర్ 3న వెస్లీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

కాచిగూడ: క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమైనవని తెలంగాణ గాడ్స్ విజన్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నెల్లమల్లి సికిందర్ తెలిపారు. గురువారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ మాత్రమేనని అన్నారు. డిసెంబర్ 3వ తేదీన సికింద్రాబాద్ లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ హాజరవుతారని తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి



మాలల సింహ గర్జన కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మాలల హక్కుల పరిరక్షణ కోసం డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టి మాలల సింహగర్జన సభకు మాలలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం నల్లకుంట తిలక్‌నగర్ బస్తీలో ఇంటింటికి తిరిగి మాల బంధువులను కలిసి మాలల సింహ గర్జన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను అన్ని రంగాలలోనూ అణచివేతకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. అణచివేతను ఎదుర్కొనేందుకు మాలలంతా ఏకమై మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అంబర్‌పేట ఇన్‌చార్జి క్రాంతికుమార్, ప్రతినిధులు సన్నీ, బస్తీ పెద్దలు రాజగోపాల్, బలరామ్, అర్జున్, బత్తుల రవి, గైదారి సత్యనారాయణ, గడ్డం ప్రదీప్, జట్టి బాలకృష్ణ, శ్రీధర్, తిలక్‌నగర్ బస్తీ అధ్యక్షుడు కె. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం

జేఏసీ సభ్యులకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ



ప్రొఫెసర్ కోదండరాంతోఅంబేడ్కర్ వర్సిటీ జేఏసీ బృందం

బంజారాహిల్స్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనున్నదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ సభ్యులకు హామీనిచ్చారు. గురువారం ఆయనను కలిసిన జేఏసీ బృందంతో చర్చించారు. తన విన్నపాన్ని మన్నించి వంటావార్పు కార్యక్రమాన్ని వాయిదా వేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన వారిలో జేఏసీ ప్రతినిధులు వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాంబ్లే, వెంకటేశ్వర్లు, రజని, ఉదయిని, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

కొనసాగిన నిరసన..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) సభ్యులు డిమాండ్ చేస్తూ గురువారం నిరసన కొనసాగించారు. గత 70 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ముందు బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రబీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, హబీబుద్దీన్, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

డిసెంబర్ 4 నుంచి సెమిస్టర్ పరీక్షలు

కాచిగూడ: డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి డా. బాలస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ వంటి కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమి సౌజన్యంతో బహుళ త్రైమాసిక మహిళా పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో రచయిత్రి నాంపల్లి సుజాత రచించిన 'కుదురు', 'బహుళ'3వ వార్షిక పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు మాట్లాడుతూ..వివిధ అంశాలపై రూపొందించిన పుస్తకాన్ని, పత్రికను ఒకే వేదికపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, హైదారబాద్ బుక్ ఫేయిర్ చైర్మన్ యాకూబ్, రచయిత్రి తిరునగరి దేవకీదేవి, గోగు శ్యామల, కొండవీటి సత్యవతి, గీతాంజలి, సీహెచ్. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 3న చిత్రకళా ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, పీకాసో ద స్కూల్ ద స్కూల్ ఆఫ్ ఆర్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో డిసెంబర్ 3న రవీంద్రభారతిలో చిత్రకళ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు బైరు రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం చిత్రకళ ప్రదర్శన వాల్ పోస్టర్‌ను ఆచార్య వెల్దండ నిత్యానందరావు ఆవిష్కరించారు. మారిషెస్‌కు చెందిన ఉమామహేశ్వరీ దీపా బహదూర్ వేసినటువంటి చిత్రాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు పి.మహేస్, ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం అందించాలి

అఫ్జల్‌గంజ్: నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఈడీ వెంకటేష్‌తో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..తెలంగాణ మత్స్యకారుల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. మత్స్యకార అభివృద్ధికి, మత్స్యకార సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఇమ్మానుయేల్

అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ఏ ఇమ్మానుయేల్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సంవత్సర కాలం గడవక ముందే ఎన్నికల ముందు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన రాజగోపాల్‌రెడ్డిని బదిలీ చేయడంతో చర్చానీయాంశంగా మారింది. కొత్త ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్మానుయేల్ గతంలో గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, నారాయణగూడ పోలీస్‌స్టేషన్, ఆసిఫ్‌నగర్‌తో పాటు ఇటీవలే సుల్తాన్‌బజార్‌లో కొద్దిరోజుల పాటు క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ రెడ్డిని సుల్తాన్‌బజార్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా, సుల్తాన్‌బజార్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఏ. ఇమ్మానుయేల్‌ను అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

ఘంటసాల గానం చిరస్మరణీయం



గాయకులతో ఒలేటి పార్వతీశం, బాలకామేశ్వర్‌రావు, ఫణి,చింతలపాటి సురేష్

చిక్కడపల్లి: ఘంటసాల గీతా గానం చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త ఒలేటి పార్వతీశం అన్నారు. గురువారం రాత్రి ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఘంటసాల భగవద్గీత స్వర్ణోత్సవ సంగీత కార్యక్రమాన్ని త్యాగరాయ గాన సభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల భగవద్గీత గానంతో చిరస్మరణీయుడు అయ్యారని అన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ... ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వ భారతరత్న ప్రకటించాలని కోరారు. తొలుత గాయకులు బాలకామేశ్వర్‌రావు, ఫణి, చింతలపాటి సురేష్, హృషికేష్ ఘంటసాల ఆలపించిన గీతాలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శంకరపల్లి శైలజ, టి.సుధాదేవి పాల్గొన్నారు.

బిర్యానీలో బొద్దింక



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం-3లోని టీవీ9 సమీపంలోని బిర్యానీవాలా రెస్టారెంట్ బిర్యానీలో బొద్దింక ప్రత్యక్షమైంది. బాధితుల వివరాల మేరకు... గురువారం మధ్యాహ్నం కొంతమంది స్నేహితులు బిర్యానీ ఆర్డర్ ఇచ్చి తింటున్న సమయంలో అందులో బొద్దింక కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన వారు నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ క్రమంలో నిర్వాహకులకు వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా బిర్యానీ వాలా యజమాని డయల్ 100కు ఫోన్ చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, అదే సమయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా అక్కడికి చేరుకొని బొద్దింక వచ్చిన బిర్యానీని సీజ్ చేసి శాంపిల్‌ను సేకరించారు. ఈ బొద్దింక ఎలా వచ్చిందనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. బిర్యానీవాలా హోటల్‌పై చర్యలకు జీహెచ్ఎంసీ అధికారులు ఉపక్రమించారు.

కష్టపడి చదివితే మంచి అవకాశాలు

సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మహ్మద్ వలియుల్లా

బంజారాహిల్స్: కోవిడ్ తర్వాత ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు గతంతో పోలిస్తే మరింత మెరుగయ్యాయని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కళాశాల ఒరియేంటేషన్ కార్యక్రమంలో గురువారం కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫెర్ జావెద్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఎప్పటికప్పుడు బయటి పరిస్థితులకు తగ్గట్టుగా సబ్జెక్టులను నేర్చుకుంటూ ముందుకుసాగాలని అప్పుడే మంచి విజయాలు సాధించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. హైదరాబాద్‌లో ఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, సొసైటీ కోశాధికారి మీర్ అక్బర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల పట్ల జాగ్రత్త వహించాలి

- ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్
- సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగింత



చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్

చిక్కడపల్లి: సెల్‌ఫోన్‌ల దొంగల పట్ల జాగ్రత్తగా వహించాలని చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.5లక్షల విలువచేసే 20సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వాటిని సెల్‌ఫోన్ బాధితులకు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ ఆయన కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా 20 సెల్‌ఫోన్లను పట్టుకున్నామని వారు తెలిపారు. చిక్కడపల్లి అశోక్‌నగర్, జవహర్‌నగర్, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులలో సివిల్స్, గ్రూప్స్ పోటీ పరీక్షల విద్యార్థులు అధిక సంఖ్యలో హాస్టల్స్, స్టడీ సెంటర్‌లు, సినిమా థియేటర్లు ఉన్నాయని సెల్‌ఫోన్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దీంతో పోయిన సెల్‌ఫోన్ లభించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు అభినందనలు తెలిపారు.

బడుగుల పిడికిలి పూలే



మహాత్మా జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బడుగుల పిడికిలి పూలే అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. , బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. బహుజనుల వజ్రాయుధంగా నిలిచి నోరులేని ప్రజల్లో జ్ఞాన చైతన్యాన్ని కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పోతగాని అయిలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సృజనకు ప్రతీక 'కాలేజ్ ఫెస్ట్'



కాలేజ్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

కాచిగూడ: బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి (టీయూఎం) కళాశాలలో గురువారం కాలేజ్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రాజెక్టులను ఫెస్ట్‌లో ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని టీయూఎం అధ్యక్షురాలు శ్యామలాదేవి అన్నారు. సృజనకు ప్రతీక కాలేజ్ ఫెస్ట్ అని అన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, థియేట్రికల్ మ్యాజిక్, వీడియో గేమ్‌లు, ఫిజికల్ గేమ్స్, ఫుడ్ స్టాల్స్, వివిధ రకాల పోటీలు, స్పెల్‌థాన్, గానం, నృత్యం, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించామని జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పద్మజ తెలిపారు.

నేటికీ మహిళలపై వివక్ష

నల్లకుంట: స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా పురుషాధిక్య సమాజంలో నేటికి మహిళలపై వివక్ష కొనసాగుతోందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా డెవలప్‌మెంట్, కౌన్సెలింగ్ సొసైటీ అధ్యక్షురాలు గోన సువర్ణ రత్నం అలియాస్ క్రిసోలైట్ అన్నారు. ఈ కారణంగా మహిళలు అన్ని రంగాలలోనూ వెనుబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులో కిషన్‌రావు ఆసుపత్రి సమీపంలో సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఆవిర్భావ సమావేశంలో క్రిసోలైట్ మాట్లాడారు. అణచివేత, వేధింపులకు గురవుతున్న మహిళలకు న్యాయం చేకూర్చాలనే సంకల్పంతో ఈ సొసైటీని స్థాపించామని చెప్పారు. మహిళలు న్యాయం కోసం తమను సంప్రదిస్తే సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు సి.మౌనిక, జి.సంగీత, జి.విజయ, అనిత, చంద్రప్రభ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోన సువర్ణ రత్నం

ప్రొస్టేట్ సమస్యలకు 'వాటర్ వేపర్ థెరపీ'తో ఉపశమనం

ఏఐఎన్‌యూ
ఎండీ డాక్టర్ సి.మల్లికార్జున

లక్డీకాపూల్: ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ సమస్యకు వాటర్ వేపర్ థెరపీ మంచి ఫలితాలను ఇస్తుందని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. యుక్త వయసులోనే ప్రొస్టేట్ సంబంధిత సమస్యలు వచ్చిన వారికి మందులు వాడినా, శస్త్రచికిత్స చేసినా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గురువారం ఎర్రమంజిల్ కాలనీలోని మెర్క్యూరీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన నూతన సాంకేతిక విధానాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మందులతో ప్రొస్టేట్ సమస్య ఉన్నవారికి కొన్నాళ్ల పాటు శస్త్రచికిత్సను వాయిదా వేయవచ్చని, కానీ ఆ తర్వాత ఐదేళ్లకో, పదేళ్లకో మళ్లీ శస్త్రచికిత్స చేయాల్సి వచ్చినప్పుడు ఆశించిన మేరకు ఫలితాలు రావటం లేదన్నారు. అయితే ఈ చికిత్స తీసుకున్న తర్వాత కొన్ని రోజులపాటు కాఫీ, చాక్లెట్లు, మద్యం జోలికి వెళ్లకపోవడం మంచిదని డాక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్, డాక్టర్ విజయ్ కుమార్ శర్మ మద్దూరి, ఏఐఎన్‌యూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.